క్లుప్తంగా

మొరాయించిన ఈవీఎంలు

తుని రూరల్: తుని మండలంలో మూడు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. కేఓ మల్లవరంలో 59వ, టి.తిమ్మాపురంలో 88వ, సుభద్రయ్యమ్మపేటలో 51వ పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. కేఓ మల్లవరం, టి.తిమ్మాపురంలో పని చేయని ఈవీఎంలు స్థానంలో కొత్త ఈవీఎంలు మార్పు చేసి పోలింగ్‌ను కొనసాగించారు. సుభద్రయ్యమ్మపేటలో చార్జింగ్ అయిపోవడంతో ఆగిపోయిన ఈవీఎంకు చార్జింగ్ చేసి పోలింగ్ ప్రక్రియను యథావిధిగా జరిపారు. ఆయా సమస్యలతో మూడు పోలింగ్ కేంద్రాల్లో గంటసేపు ఓటింగ్ ప్రక్రియకు అంతరాయం కలిగింది.

సీతారాంపురంలో...

తొండంగి: మండలంలోని చిన్నచిన్న ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా 72 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఏడు గంటలకు అధికారులు పోలింగ్ ప్రారంభించారు. ఉదయం 10 గంటల సమయానికి 25 శాతం వరకూ పోలింగ్ జరిగింది. పలు గ్రామాల్లో పోలింగ్ మందకొడిగా సాగడంతో వృద్ధులు, మహిళలు, వికలాంగులు గంటల తరబడి పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడి ఇబ్బందులు పడ్డారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఓట్లు వేసేందుకు బారులు తీరారు. సాయంత్రం 6 గంటల సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న ఓటర్లందరికీ స్లిప్పులు ఇచ్చి పోలింగ్ పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తొండంగి మండలం సీతారాంపురంలో 170వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో దాదాపుగా గంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. దీంతో ఎన్నికల అధికారులు ఈవీఎంలను మార్చి పోలింగ్‌ను పునరుద్ధరించారు. మండలంలోని ఏవీ నగరంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్య తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వి.కొత్తూరులో ఓటు వేసిన జెడ్పీటీసీ సూర్యమణి



వి.కొత్తూరులో ఓటు హక్కును వినియోగించుకున్న జెడ్పీటీసీ సూర్యమణి, పోతల రమణ

తుని రూరల్: జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (తుని జెడ్పీటీసీ) సభ్యురాలు పోతల సూర్యమణి తన ఓటు హక్కును వి.కొత్తూరులో వినియోగించుకున్నారు. తన భర్త, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణతో కలసి ఆమె పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు.

శంఖవరం మండలంలో 70 శాతం పోలింగ్



జి.కొత్తపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద క్యూకట్టిన ఓటర్లు

శంఖవరం: మండలవ్యాప్తంగా ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచి ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్దకు పోటెత్తారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని అధికారులు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మందకొండిగా సాగిన పోలింగ్ సాయంత్రం వేగం పుంజుకుంది. మండలంలో సుమారు 70 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మొదటి ఓటు అనుభూతి

ఆనందంగా ఉంది



తొండంగి మండలం ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన నేను బాలింతను. నాకు ఓటుహక్కు రావడంతో మొదటిసారి ఎన్నికల్లో ఓటు వేశాను. ప్రజాస్వామ్యంలో మొదటిసారి ఓటుహక్కును వినియోగించుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రజలకు మంచి చేసే వ్యక్తికి ఓటువేయడం సంతృప్తినిచ్చింది.

–రామవరపు శివలీల, బాలింత, ఎ.కొత్తపల్లి గ్రామం

సద్వినియోగం చేసుకున్నాను



రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నేను తొలిసారిగా సద్వినియోగం చేసుకున్నాను. మనల్ని పాలించే వ్యక్తులను మనమే ఎన్నుకోవడం అనేది ప్రజాస్వామ్యానికి ప్రతీక. ఇకపై ప్రతి ఎన్నికల్లోనూ కచ్చితంగా ఓటుహక్కు వినియోగించుకుంటాను.

–బండి అనూష, యువత, ఎ.కొత్తపల్లి గ్రామం



లింగంపర్తిలో ఓటు వేసిన ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, ఆయన సతీమణి వెంకటలక్ష్మి



వీరవరంలో కుటుంబ సమేతంగా ఓటు వేసిన తోట నరసింహం



ఎస్.సూరవరంలో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా

ఊరుమే ఉత్సాహంతో ఓటుకు జై..

మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. కొత్తగా ఓటు వచ్చిన యువత నుంచి వందేళ్లు పైబడిన వృద్ధుల వరకూ ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారు. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. కొన్ని చోట్ల రాత్రి 10 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. పలు గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడం, పోలింగ్ మందకొడిగా సాగడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు.

- ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- ఓటు వేసేందుకు ఆసక్తి చూపిన ఓటర్లు
- పోలింగ్ కేంద్రాల వద్ద గంటల తరబడి నిరీక్షణ
- పలు చోట్ల స్వల్ప ఉద్రిక్తతలు



తునిలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



ఏలేశ్వరంలో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వస్తున్న వృద్ధురాలు

తుని: నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు భారీగా తరలివచ్చారు. తుని నియోజకవర్గం పరిధిలో 224 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 2,24,945 మంది ఓటర్లు ఉన్నారు. తుని పట్టణంతో పాటు తొండంగి, కోటనందూరు, తుని మండలాల్లో తరచూ ఈవీఎంలు మొరాయించాయి. దీంతో కొన్ని బూత్‌ల్లో పోలింగ్ ఉదయం 8.30 గంటలకు ప్రారంభించారు. అప్పటికే క్యూలైన్‌లో ఉన్న మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది నెమ్మదిగా పక్రియను కొనసాగించారు. సాయంత్రం 6 గంటలకు వందల సంఖ్యలో ఓటర్లు క్యూలైన్‌లో ఉండిపోయారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్న తపనతో గంటల సమయం నిరీక్షించారు. సాయంత్రం 6 గంటలకు 65 శాతం పోలింగ్ నమోదైంది.

అధికారుల తీరుతో ఇక్కట్లు

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని ఎన్నికల సంఘం చేసిన ప్రకటనలను అధికారులు పాటించలేదు. ఓటుహక్కును వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లు క్యూలైన్‌లో నరకయాతన అనుభవించారు. వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాల్సిన ఉండగా ఈవీఎంలు, వీవీప్యాట్‌లు మొరాయించడంతో ఆలస్యమైంది.

ప్రగతికే పట్టం !

పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేసిన ఓటర్లు బయటకు వచ్చాక ఎవరికి వేశారని అడిగినా చెప్పలేదు. యువత ఎక్కువ శాతం పోలింగ్‌లో పాల్గొన్నారు.



శరభవరంలో వీల్‌చైర్‌పై ఓటు వేసేందుకు వెళ్తున్న వృద్ధుడు అప్పలరాజు

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే నాయకుడికే ఓటు వేశామని చెప్పారు. పోలింగ్ స్టేషన్లకు భారీగా మహిళలు, యువత తరలివచ్చారు. పోలింగ్ నెమ్మదిగా జరిగినా గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇతర రాష్ట్రాలు, పట్టణాల్లో ఉన్న ప్రజలు స్వస్థలాలకు వచ్చారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజా తుని మండలం ఎస్.అన్నవరంలో ఓటు వేశారు.

ఎందుకిలా చేశారూ !

ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. నియోజకవర్గంలో ఎన్ని కేంద్రాలు ఉన్నాయి, ఓటర్ల సంఖ్య తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎన్నికల సంఘానికి పంపాలి. ఈ విషయంలో కొన్ని చోట్ల స్థానిక రెవెన్యూ అధికారులు పొరపాటు చేశారు.

టెంట్లు, మెడికల్ క్యాంపులు

వేసవిని దృష్టిలో పెట్టుకుని పోలింగ్ స్టేషన్లలో సామియానాలు, మెడికల్ క్యాంపు, మంచి నీరు ఏర్పాటు చేశారు. సదుపాయాలు కల్పించినా ఓటింగ్ పక్రియ ఆలస్యం కావడంతో మహిళలు ఇబ్బందులు పడ్డారు. దీనికి తోటు సాయంత్రం 6 గంటలకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు వర్షంతో అవస్థలు పడ్డారు. పలు చోట్ల వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నియోజకవర్గంలో ప్రశాంతంగా ఓటింగ్ జరిగినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేవీ రామలక్ష్మి తెలిపారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో ..

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నియోజకవర్గవ్యాప్తంగా సోమవారం ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పోలింగ్ ముగిసింది. నియోజకవర్గంలో 227 పోలింగ్‌బూత్‌ల్లో ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ పోలింగ్ జరిగింది. కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ రాత్రి 8 గంటల వరకూ కొనసాగింది. ఓటర్లు ఉదయం 6 నుంచే పోలింగ్ బూత్‌ల వద్ద క్యూ కట్టారు. దీంతో ఉదయం పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. ఎండను సైతం లెక్కచేయకుంటా ఓటు వేసేందుకు ఓటర్లు ఉత్సాహం చూపారు. మహిళలు, వృద్ధులు గంటల తరబడి క్యూలో నిలబడి ఓటు వేశారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు తన స్వగ్రామం లింగంపర్తిలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను వరుపుల సుబ్బారావు పరిశీలించారు. ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో వికలాంగులు, వృద్ధులు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ప్రత్తిపాడు మండలంలోని ఒమ్మంగి, ధర్మవరం గ్రామాల్లో చిన్నచిన్న ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. గ్రామాల్లో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకూ ప్రశాంతంగా కొనసాగింది. 6 గంటల తర్వాత కూడా క్యూలైన్లలో ఉన్న ఓటర్లకు స్లిప్పులు ఇచ్చి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని అధికారులు కల్పించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్‌లు ఏర్పాటు చేసి, ఓటర్లకు నీడ కల్పించారు. తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య సేవలు, వీల్ చైర్లను సైతం అందుబాటులో ఉంచారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలోని 101 పోలింగ్ కేంద్రంలో ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించే సందర్భంలో ఈవీఎంలు మొరాయించడంతో వాటి స్థానంలో కొత్త ఈవీఎంలు ఏర్పాటు చేశారు. శరభవరంలో కొంతమంది ఓటర్లు ఓటేసిన తరువాత ఈవీఎం మొరాయించడంతో మరోకటి ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావుతో పాటు పోటీలో నిలిచిన అభ్యర్థులు గ్రామాలను సందర్శించి, ఓటింగ్ సరళిని పరిశీలించారు.

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. అప్పటికే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు క్యూల్లో బారులు తీరారు. మండల వ్యాప్తంగా సాయంత్రం ఆరు గంటల వరకూ 68.75 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు.

కోటనందూరు: మండలవ్యాప్తంగా సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచే ఓటు వేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. పలు గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఉదయం 10 గంటల వరకూ పోలింగ్ మందకొడిగా సాగింది. మధ్యాహ్నం దాటినా సగం కూడా పోలింగ్ జరగలేదు. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో గంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. కాకరాపల్లి, పాతకొట్టాం, అల్లిపూడి, కేపీ మల్లవరం తదితర గ్రామాల్లో 10 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది.



ప్రత్తిపాడు గ్రామ సచివాలయంలో పోలింగ్ కేంద్రం వద్ద క్యూ కట్టిన ఓటర్లు



రమణయ్యపేటలో తొలి ఓటు వేసి ఆనందం వ్యక్తం చేస్తున్న యువతి



కాకరాపల్లిలో చీకటి పడిన తరువాత ఓటు వేసేందుకు లైన్లో నిలబడిన మహిళా ఓటర్లు

మెట్టలో ఓటెత్తిన చైతన్యం



రంపయర్రంపాలెంలో ఓటు హక్కు వినియోగించుకున్న దివ్యాంగుడు



ఇర్రిపాకలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



గోకవరం మండలం రంపయర్రంపాలెంలో ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధురాలు



గోకవరం మండలం తంటికొండలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

గోకవరం: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. తమ ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. నియోజకవర్గంలో 248 పోలింగ్ బూత్‌లు ఉండగా 2.29 లక్షలు మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లు ఉదయం 6.30 గంటల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి క్యూలో వేచి ఉన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద దాదాపు ఇదే పరిస్థితి ఉండటంతో సందడిగా మారింది. పలు చోట్ల ఈవీఎంలు మొరాయించినప్పటికీ అధికారులు వాటిని సరిచేయడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు సైతం ఓటు హక్కుని వినియోగించుకున్నారు. సాయంత్రం ఆరు గంటల వరకూ పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్న వారికి అధికారులు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. ఈ విధంగా గోకవరం మండలంలోని కృష్ణునిపాలెం, రంపయర్రంపాలెం, గోకవరం గ్రామాల్లో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. అలాగే గండేపల్లి మండలంలో మల్లేపల్లి, గండేపల్లి, మురారి, కె.గోపాలపురం గ్రామాల్లో రాత్రి వరకు పోలింగ్ జరిగింది.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

కిర్లంపూడి మండలం వీరవరంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కుటుంబ సమేతంగా పోలింగ్ బూత్ వద్దకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా పోలింగ్

జగ్గంపేట: జగ్గంపేట నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సాయంత్రం ఆరు గంటల వరకూ 71.43 శాతం పోలింగ్ జరిగిందని, ఇంకా పలు ప్రాంతాల్లో ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద వేచి ఉన్నారని ఆర్‌ఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గంలో కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయని వాటి స్థానంలో వేరే వాటిని తక్షణమే ఏర్పాటు చేశామని తెలిపారు.

అక్కడక్కడ స్వల్ప ఘర్షణలు

ఎన్నికల పోలింగ్ సందర్భంగా జగ్గంపేట మండలంలోని ఇర్రిపాక, మర్రిపాక, మామిడాడ, నరేంద్రపట్నం తదితర గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయని జగ్గంపేట సీఐ లక్ష్మణరావు తెలిపారు.

కిర్లంపూడి: మండలంలోని సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పలు పార్టీలు ఏర్పాటు చేసిన బస్సుల్లో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లు తమ స్వగ్రామాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని ముక్కొల్లు, భూపాలపట్నం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరకొట్టారు. శృంగరాయునిపాలెం, కిర్లంపూడిలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. జగపతినగరంలో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగించారు.

ఓటుకు పోటెత్తిన ఓటర్లు



ఎన్.సూరవరంలో బారులు తీరిన ఓటర్లు



డి.పోలవరంలో కిక్కిరిసిన క్యూలైన్లు

తుని రూరల్: ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కావలసి ఉండగా పోలింగ్ కేంద్రాలకు ఉదయం ఆరు గంటలకే ఓటర్లు చేరుకున్నారు. పోలింగ్ ప్రక్రియ మందకొడిగా సాగడంతో క్యూలైన్లలో గంటలు తరబడి ఓటర్లు నిరీక్షించారు. సాయంత్రం ఆరు గంటలకు వందలాది మంది క్యూలైన్లలో ఉండిపోయారు. వీరందరికీ స్లిప్పులు ఇచ్చారు. సిప్పులు తీసుకున్న ఓటర్లంతా ఓటేసే వరకూ పోలింగ్ కొనసాగిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు. మండలంలోని కొలిమేరు, డి.పోలవరం, ఎన్.సూరవరం, ఎస్‌బీ పేట, కేఓ మల్లవరం, తేటగుంట, ఎస్.అన్నవరం, హంసవరం, తాళ్లూరు, వి.కొత్తూరు, లోవ కొత్తూరు తదితర గ్రామాల్లో ఓటర్లు క్యూలైన్లలో ఉన్నారు. తుని మండలంలో 72 పోలింగ్ కేంద్రాలు ఉండగా 66718 మంది ఓటుహక్కు వినియోగించుకోవలసి ఉంది. వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా ఎన్.సూరవరం, కొలిమేరు, ఎన్ఎస్‌వీ నగరం, కుమ్మరిలోవ, ఎస్.అన్నవరం తదితర గ్రామాల్లో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

విరిగిన కాలితో ఓటేసిన మహిళ



బీఎస్‌పేటలో కాలికి తీవ్రగాయమైనా మండుటెండను లెక్క చేయకుండా ఓటేసేందుకు వీల్ చైర్‌లో వెళుతున్న మహిళ



కొలిమేరులో ఓటేసేందుకు పోలింగ్ బూత్‌కు వెళుతున్న 75 ఏళ్ల వృద్ధురాలు

తుని రూరల్: డి.పోలవరం శివారు సుభద్రయ్యమ్మపేటలో ఒక మహిళ ఎడమ కాలు విరిగినా పోలింగ్ కేంద్రానికి వెళ్లి తన ఓటు హక్కు వినియోగించుకుంది. బంధువులు, వీల్‌చైర్ సహాయంతో మండుటెండలో 51వ పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటేసింది. కొలిమేరులో 75 ఏళ్ల వృద్ధురాలు బంధువులతో ఆటోలో పోలింగ్ కేంద్రానికి వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకుంది.